క్లుప్తంగా

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



పోలేకుర్రులో విరిగిపడిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

తాళ్లరేవు: మిచాంగ్ తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేటలో రెండు, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ సీహెచ్ శ్రీనివాస్, సిబ్బంది హుటాహుటీన అక్కడకు చేరుకుని స్తంభాలను మార్చడంతో పాటు విద్యుత్‌ను పునరుద్ధరించారు. తక్షణమే స్పందించిన అధికారులను గ్రామస్తులు అభినందించారు.

లక్ష బిల్వార్చన



త్రయంబకేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన పూజ చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

భగవద్గీత ప్రచార కార్యక్రమం



వేములపల్లిలో ఆధ్యాత్మిక గ్రంథాలతో భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం వేములపల్లిలో సోమవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు భరత్, జైరామ్, సత్యనారాయణ, ఆదిబాబు, సంధ్య, సూర్యకుమారి, జ్యోష్ణ మాట్లాడుతూ కార్తిక దీపం విశిష్టతను వివరించారు. భగవద్గీత సారాంశం ఉన్న పుస్తకాలను భక్తులకు అందజేశారు.

అంతర్జాతీయ పోటీలకు పవర్ లిఫ్టర్లు



వందన, వీరేందర్‌లను అభినందిస్తున్న బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు పవర్ లిఫ్టింగ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకూ మలేషియా దేశంలో జరగబోయే ఏషియన్ పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీలకు జిమ్ క్రీడాకారిణి పిల్లి వందన ఎంపికైంది. ఇదే జిమ్‌కు చెందిన క్రీడాకారుడు మారే వీరేందర్ ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ తెనాలిలో జరగనున్న సౌత్ ఇండియా (జాతీయ) పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. జిమ్‌లో సోమవారం ఉదయం జరిగిన అభినందన సత్కార సభలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వందన, వీరేందర్‌లను కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఇద్దరు క్రీడాకారులు విజేతలై కోనసీమకు తిరిగి రావాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, చిక్కం రాంబాబు, గంగుమళ్ల వెంకటరత్నం విజేతలను అభినందించారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

అంబాజీపేట: తనపై తప్పుడు ప్రచారం చేశారనే మనస్తాపంతో ఒక యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రసాద్ నగర్ కాలనీకి చెందిన చోడే వెంకట శ్రీహరి, స్థానికంగా ఒక మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడంటూ అదే కాలనీకి చెందిన పెదపూడి కిరణ్, నేదునూరి సిద్దు ప్రచారం చేస్తున్నారు. వారితో పాటు మండలంలోని నందంపూడికి చెందిన మరో యువకుడు తులసీరాం కూడా శ్రీహరిని నానా దుర్భాషలాడాడు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన శ్రీహరి.. తన తల్లి వినియోగించే 10 మాత్రలు నీటిలో కలిపి తాగాడు. అపస్మార స్థితికి చేరుకున్న శ్రీహరిని 108లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. శ్రీహరి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎ.చైతన్య కుమార్ తెలిపారు.



భారీ వర్షాలకు నేలకొరిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న అల్లవరం ఏఓ సత్యనారాయణ



ఓడలరేవు తీరంలో భారీగా ఎగసిపడుతున్న కెరటాలు



భీమనపల్లిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

వణికిస్తున్న మిచాంగ్ తుపాను

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- ముంపు బారిన వరిపొలాలు
- సహాయక చర్యలందిస్తున్న అధికార యంత్రాంగం

అల్లవరం/ముమ్మిడివరం/ఐ.పోలవరం/యానాం/ఉప్పలగుప్తం/కాట్రేనికోన: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను తీవ్ర రూపం దాల్చడంతో తీర ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తుంది. ఓడలరేవు, ఎస్.రామేశ్వరం, కొమరగిరిపట్నం సముద్ర తీర ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. భారీ కెరటాలు ఎగసిపడుతున్నాయి. తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుంది. అల్లవరం మండలంలో 3 వేల ఎకరాల్లోని వరి క్షేత్రాల్లో వర్షం నీరు చేరింది. ఈదురు గాలులకు అల్లవరం, రెల్లుగడ్డ, బెండమూర్లంక గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. వర్షాలకు పడిపోయిన వరి క్షేత్రాలను వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. ముంపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వర్షం మరింత పెరిగితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలం గోపవరంలో చల్లపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిపై మహా వృక్షం నేలకొరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఎటువంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టారు.



అమలాపురం పట్టణంలో ముంపునకు గురైన గండువీధి రోడ్డు



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

ముంపు బారిన లోతట్టు ప్రాంతాలు

మిచాంగ్ తుపాను ప్రభావంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రహదారులు, చెరువులు ఏకమై లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 30 కాలనీలు నీటమునగడంతో వందలాది ఇళ్లలోకి నీళ్లు చేరి సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. నగర పంచాయతీలో జీఎంసీ బాలయోగి కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, హైస్కూలు గ్రౌండు, సినిమా రోడ్డు, సంత మార్కెట్ సెంటర్ కాలనీలు నీటమునిగాయి. గాడిలంక పల్లాలమ్మ కాలనీ, కర్రివానిరేవు కొత్తకాలనీ, కొమానపల్లి అంబేడ్కర్ కాలనీతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. కాట్రేనికోన మండలంలోని పల్లంకుర్రు, కందికుప్ప, దొంతికుప్ప, కొప్పిగుంట, కాట్రేనికోన గ్రామాల్లో రోడ్లు, సంతమార్కెట్ ప్రాంతం నీట మునిగాయి.

అప్రమత్తమైన అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను తీవ్ర రూపం దాల్చడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను చేపట్టింది. తీరప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి బాధితులను తరలిస్తున్నారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డి పరిశీలించి బాధితులకు అందుతున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉప్పలగుప్తం మండలంలోని వాసాలతిప్ప సముద్ర తీరాన నివసిస్తున్న నక్కపల్లి మండలం నుంచి వలస వచ్చిన మత్స్యకారులను నక్కా రామేశ్వరం తుపాను రక్షిత భవనానికి సోమవారం తరలించారు. వాసాలతిప్పలో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావులు బాధితుల కోసం పునరావాస ఏర్పాట్లను పరిశీలించారు. ఐ.పోలవరం మండలంలో ముందస్తు చర్యల్లో భాగంగా తీరప్రాంత గ్రామాలైన భైరవపాలెం, జి.మూలపాలంల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తీరగ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలను డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర పరిశీలించారు.



కాట్రేనికోనలో నీటమునిగిన వరి పనలు

తుపాను బాధితులకు పరామర్శ

మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాలలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సోమవారం పర్యటించారు. అనంతరం పునారావాస కేంద్రాల్లో ఉన్న బాధితుల కోసం సెంట్రల్ కిచెన్‌లో తయారు చేస్తున్న భోజనాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఎమ్మెల్యే వెంట ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముఖం, ఎస్ఐ సుబ్బారాజు తదితరులున్నారు.

పల్లపు ప్రాంతాల జలమయం

అమలాపురం టౌన్: తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు అమలాపురం పట్టణంలోని స్థానిక కుంకాల సందు, సావరం రోడ్డు, ముస్లింవీధి, యర్రమిల్లివారివీధి, గండువీధి రోడ్లు ముంపునకు గురయ్యాయి. స్థానిక గరిగుంట చెరువు వద్ద డ్రెయిన్లలో నీరు పొంగి పక్కనే ఉన్న సర్వ మంగళ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం ముంపునకు గురైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ తదితరులు ఆయా కాలనీలను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయిన్లలో అడ్డు పడుతున్న చెత్తా చెదారాన్ని తొలగించి ముంపు నీరు త్వరగా దిగేలా చర్యలు చేపట్టారు.



తుపాను బాధితులకు స్వయంగా భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అశోక్



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో నీట మునిగిన వరి చేను



భైరవపాలెం పునరావాస కేంద్రంలో ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డి



గోపవరంలో నేలకొరిగిన మహా వృక్షం

అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పటవల గ్రామస్తులు

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ పరిధిలోని పటవల, శాంతిమూల, కొత్తూరు, రామన్నపాలెం, రాఘవేంద్రపురం గ్రామాలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు స్థానికులు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు నేతృత్వంలో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. 1977–79లలో పటవల పంచాయతీలో సుమారు 50 మందికి అసైన్డ్ భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు ఇచ్చారని అయితే వాటికి పట్టాలు, పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఆయా భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టేకుమూడి ఈశ్వరరావు, కొప్పిశెట్టి వెంకట్, వెంకట రమణ, శ్రీనివాస్, లోవబాబు తదితరులున్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొత్తపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) యార్డులో ఏర్పాటు చేసిన నాఫెడ్ – ఆయిల్‌ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని కమిటీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొబ్బరి రైతులకు ఆమె విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తోందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ అని చిన్నచూపు చూస్తే.. నేటి సీఎం జగన్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బ తింటే రైతులు నష్టపోకుండా ఒకపక్క ఉచిత పంటల బీమా, మరోపక్క ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటోందని గుర్తు చేశారు. కొబ్బరి దిగుబడి తగ్గిపోయి, తగిన ధర లేక కోనసీమ రైతులు నష్టపోతున్న విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, కొబ్బరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. రైతులందరూ నిబంధనలు పాటిస్తూ కొబ్బరి విక్రయించడం ద్వారా తగిన గిట్టుబాటు ధర పొందాలని రవీదేవి సూచించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ కోఆర్డినేటర్ యు.సుధాకరరావు కొనుగోలు కేంద్రంలో నియమ నిబంధనలను వివరించారు. అనంతరం పలువురు రైతులు తీసుకువచ్చిన కొబ్బరిని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ వి.యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో కొబ్బరి తూకం వేయిస్తున్న రవీదేవి, సుధాకరరావు

ఘనంగా ఘంటసాల శతజయంత్యుత్సవం



ఘంటశాల శతజయంత్యుత్సవంలో గీతాలను ఆలపిస్తున్న గాయకుడు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలోని ధూళిపూడి గొల్లబాబు కల్యాణ మండపంలో ఘంటసాల శతజయంత్యుత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. న్యూఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గానావధానం, సంగీత విభావరి కార్యక్రమాలు జరిగాయి. అవధాన కార్యక్రమంలో పదిమంది కళాకారులు ప్రశ్నలు వేయగా డా.రెహంతుల్లా ఒకేసారి పది ప్రశ్నలకు జవాబులు చెప్పి ఆహూతులను ఆశ్చర్యచకితులను చేశారు. ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ ఎస్.ఆదినారాయణ, తనికెళ్ల పార్థసారథి, కారక రాజబాబు, కనక రత్నమాల, ఆకుల శ్రీనివాస్, కామన ప్రభాకర్‌రావు, పుల్లెపు వెంకటేశ్వరరావు, వాకపల్లి చిరంజీవి, వల్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగన్ రావాలి



వానపల్లిపాలెంలో సంక్షేమ పథకాల లబ్ధి పట్టికను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అన్నారు. మండలంలోని వానపల్లిపాలెం, మునిపల్లి సచివాలయం పరిధిలో ఆయన అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమాల పట్టికను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కోటం లోవరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లా నాయుడు, సచివాలయ కన్వీనర్ నల్లా సూర్యప్రకాష్, బొంతు వీర్రాఘవులు, మెట్ల శ్రీనివాసరావు, నల్లా ఆదినారాయణ, వెంకట నారాయణ, భేతాళుడు, దుర్గారావు, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శివోహం.. భక్తజన సందోహం..

- శివాలయాల్లో కార్తిక మాసం మూడో సోమవారం పూజలు
- మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఐ.పోలవరం: కార్తిక మాసం మూడో సోమవారం కావడంతో శైవ క్షేత్రాల్లో శివనామస్మరణతో మార్మోగాయి. శివాలయాల్లో కార్తిక శోభ వెల్లివిరిసింది. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. తుపాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కజేయకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పవిత్ర వృద్ధ గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ఆవరణలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో స్వామికి ప్రథమాభిషేకాలు 130, లఘున్యాస పూర్వక అభిషేకాలు 230 జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేశనకుర్రుపాలెం రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, ఎదుర్లంక తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.



అమలాపురం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు



అమలాపురంలో శివాలయం ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కార్తిక సోమవారం పూజలు

ఉప్పలగుప్తం: కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భీమనపల్లి అనంగేశ్వర స్వామి, చల్లపల్లి చౌడేశ్వరస్వామి, గొల్లవిల్లి భీమేశ్వర స్వామి, ఉప్పలగుప్తం, మునిపల్లి పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు వచ్చి స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాళ్లరేవు: పవిత్ర కార్తిక సోమవారాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చొల్లంగి రాజరాజేశ్వరీ సహిత సోమేశ్వర స్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామి, కోరంగి కురంగేశ్వర స్వామి, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామి, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో స్వామికి విశేష పూజలు చేశారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన కాపులపాలెం శ్రీభద్రకాళీ సహిత వీరేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వీరేశ్వరస్వామివారికి పంచామృతాభిషేకాలు, చందనం తదితర ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: కుండపోతలా వర్షం పడుతున్నా లెక్కజేయకుండా శివయ్య దర్శనానికి భక్తులు తరలివెళ్లారు. అమలాపురం పట్టణంలోని పురాతన శివ క్షేత్రం చెన్నమల్లేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ భక్తుల తాకిడి కొనసాగింది. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, సిద్ధేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆలయాలు కార్తిక దీపాల శోభను సంతరించుకున్నాయి. చెన్న మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి, ఈఓ సత్యనారాయణ, సర్వమంగళ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.



మురమళ్ల వీరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు



మురమళ్ల వీరేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు



తాళ్లరేవు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు